

● పత్తి పంటలో డౌర కొడుతున్న రైతులు



● రెండో విడత రుణమాఫీ చెక్కును అందజేస్తున్న కలెక్టర్, డీసీసీబీ చైర్మన్, తదితరులు

రెండో విడత మాఫీ షురూ..

- జిల్లాలో రూ.లక్షా 50వేల లోపు రైతు రుణాల మాఫీకి నిధులు
- రూ.201 కోట్ల 83 లక్షలను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ
- మొత్తం 17వేల 647 మంది రైతులకు రుణ విముక్తి
- ఇప్పటికే మొదటి విడతను పూర్తి చేసిన సంబంధిత శాఖ అధికారులు
- ప్రభుత్వ నిర్ణయంపై అన్నదాతల హర్షం
- సాంకేతిక లోపాల వల్ల అక్కడక్కడ తలెత్తుతున్న సమస్యలు
- సెల్ నెం.7288890003 ద్వారా సంప్రదిస్తే.. 30 రోజుల్లో పరిష్కారం
- జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయిలో రైతుల రుణ మాఫీ కాగానే.. ప్రత్యేక డ్రైవ్

ఆదిలాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీకి విడతల వారీగా నిధులను మంజూరు చేస్తోంది. ఇప్పటికే జూలై 18న రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేస్తూ మొదటి విడత కింద 18వేల 821 మంది రైతులకు గాను రూ.120కోట్ల 79లక్షల రుణమాఫీ నిధులను విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేసింది. అలాగే మంగళవారం రెండవ విడత కింద రూ.లక్ష 50వేల లోపు పంట రుణాలకు గాను రూ.201 కోట్ల 83లక్షల నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అనుకున్న విధంగానే రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేయడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడతలో అక్కడక్కడ కొంతమంది రైతులకు రుణమాఫీ సొమ్ము జమ కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. బ్యాంకు ఖాతాల్లో సాంకేతిక లోపాలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులలో రైతుల పేర్లు, కుటుంబ వివరాలు తప్పుగా నమోదు కావడంతో కొన్ని ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ కాగానే.. ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి అర్హులైన రైతులందరికీ.. పంట రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖాధికారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా మరి ఇంకేమైనా సమస్యలు తలెత్తితే జిల్లా నోడల్ అధికారి ఎస్.రమేష్ సెల్ నెం.7288894003 ద్వారా సంప్రదించాలని సూచిస్తున్నారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి 30 రోజుల్లో పరిష్కారం చూపుతామని అధికారులు పేర్కొంటున్నారు. అయితే రెండవ విడత రుణమాఫీకి ప్రభుత్వం నిధులను విడుదల చేయడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 17,647 మంది రైతులు

ప్రభుత్వం విడుదల చేసిన రెండవ విడత రుణమాఫీ జాబితాలో జిల్లాకు చెందిన 17వేల 647 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇందుకు గాను రూ.201కోట్ల 83లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదును జమ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. మొదటి విడతలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో కొంత మంది రైతుల ఖాతాలకు సంబంధించిన సమస్యలు తలెత్తడంతో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. అదేవిధంగా మిగితా బ్యాంకుల్లోని రైతు ఖాతాల్లో మాత్రం సకాలంలోనే నగదు జమ అయ్యింది. అయితే రూ.లక్ష లోపు రుణాలు ఉన్న కొంత మంది రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. అసలు ఎందుకు మొత్తం రుణమాఫీ కాలేదంటూ ఆయా రైతులు సంబంధిత శాఖ అధికారులను అడుగుతున్నా.. సరైన సమాధానం రావడం లేదు. ఉన్నతాధికారులకు నివేదించి సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్న ఇప్పటి వరకు ఏఒక్క రైతు సమస్యను అక్కడికక్కడే పరిష్కరించిన దాఖలాలు లేవు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణమాఫీకి అర్హులైన కొంత మొత్తంలోనే రుణమాఫీ కావడం గందరగోళ పరిస్థితులకు దారి తీస్తుంది. రెండవ విడతలోనైనా రూ.లక్ష 50వేల లోపు అందరికీ రుణమాఫీ వర్తించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

32 రకాల నిబంధనలు

రైతు రుణమాఫీ అమలులో అర్హులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 32 రకాల నిబంధనలను విధించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే మొదటి విడతను పూర్తి చేసిన అధికారులు రెండవ విడతను అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉంటేనే రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఇందులో ఆధార్‌కార్డులోని పేరు, రుణ ఖాతాలోని పేరు వేర్వేరుగా ఉండడం, కుటుంబ సభ్యుల నిర్ధారణ, రైతు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండడం, అలాగే సర్వీస్ పెన్షన్‌దారులై ఉండడం, పట్టాపాస్ పుస్తకం లేకపోవడం, కుటుంబంలో మినహాయింపు లేని ప్రభుత్వ ఉద్యోగి ఉండడం, రేషన్ కార్డు లేకపోవడం, ఇద్దరు కస్టమర్ రైతుల ఐడీ ఒకే రకంగా ఉండడం, తీసుకున్న రుణానికి వడ్డీ రెట్టింపు కావడం, పంట రుణ మాఫీపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడం, బ్యాంకు అకౌంట్లు తప్పుగా ఉండడం, ఒకే అకౌంట్ నెంబర్‌తో పలువురు రైతుల పేర్లు ఉండడం, రైతులు మరణించడం, ఒకే ఆధార్ కార్డును పలువురు రైతుల ఖాతాలకు జత చేయడం లాంటి సమస్యలతో రుణమాఫీ నిలిపి వేస్తున్నట్లు తెలుస్తుంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రుణమాఫీ వర్తించని రైతులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఆ తర్వాత అర్హులైన రైతులకు మాత్ర మే రుణమాఫీ వర్తిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.





పక్కన ఫొటోలో.. కనిపిస్తున్న రైతుపేరు తాటిపెల్లి అఖిల్‌రావు. తలమడుగుకుచెందిన ఈ రైతు 2019లో మండలకేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో తనకున్న ఎకరంన్నర భూమిపై రూ.55వేలను పంట రుణంగా తీసుకున్నాడు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.లక్ష లోపు రైతు రుణమాఫీ జాబితాలో అఖిల్‌రావు పేరు లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నాడు. ప్రస్తుతం తనకున్న ఎకరంన్నర భూమిలో పత్తి పంటను సాగు చేస్తున్నాడు. తనకు రుణమాఫీ వర్తించకపోవడంపై అధికారులను ప్రశ్నిస్తే.. తమకేమీ తెలియదంటూ చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. రెండో విడత రుణమాఫీ జాబితాలో కూడా తన పేరు ఉంటుందో? లేదో?నని ఆందోళనకు గురవుతున్నాడు. ఇప్పటి వరకు ఈ రైతుకు రుణమాఫీ వర్తించకపోవడంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని చెబుతున్నాడు. ఇలాంటి పరిస్థితే జిల్లాలో మరికొంతమంది రైతులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తుంది.

ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం

: ఎస్.రమేష్, జిల్లా నోడల్ అధికారి, ఆదిలాబాద్

పంట రుణమాఫీలో రైతులకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే మండల స్థాయిలోనే వ్యవసాయ శాఖాధికారులకు ఫిర్యాదు చేయాలి. వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం. దాదాపుగా మొదటి విడతలో రైతులందరికి రుణమాఫీ సొమ్మును రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగింది. తాజాగా రెండవ విడత రుణ మాఫీ జాబితాను కూడా విడుదల చేయడం జరిగింది. జిల్లావ్యాప్తంగా 17 వేల 647 మంది రైతులకు గాను రూ.201 కోట్ల 83లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. రెండు మూడు రోజుల్లోనే రైతులందరి ఖాతాల్లో రుణమాఫీ సొమ్మును జమ చేయడం జరుగుతుంది.

సంక్షిప్త సమాచారం



క్లోరినేషన్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

తాగునీటి బావుల్లో క్లోరినేషన్

నార్నూర్, జూలై 30: మండలకేంద్రంలో ఉన్న అన్ని తాగునీరు బావుకి మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది క్లోరినేషన్ చేసి బావుల చుట్టు పక్కల ఉన్న గడ్డి మురికి మట్టిని తీశారు. గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలు బావులు నిండిపోయాయి. క్రిములు కీటకాలు ఉంటే వి నీరు తాగడం వలన వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటదని క్లోరినేసన్ చేయడం చాలా అవసరం అని పంచాయతీ కార్యదర్శి దినేష్ అన్నారు. వారి వెంట పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌లు పి.సురేందర్, కృష్ణ, కిరణ్, బాపురావ్, తదితరులున్నారు.

1 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ఆదిలాబాద్ రూరల్, జూలై 30: టీజీ డీసెట్ 2024 లో ర్యాంక్ సాధించిన ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులకు రెండేళ్ల డీఈఐ, ఈడీ, డీపీఎస్ఈ ప్రవేశానికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాలలో ఆగస్టు ఒకటి నుంచి ఆరో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.

కేఆర్‌కే కాలనీలో పరిశీలన

ఆదిలాబాద్ రూరల్, జూలై 30: పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో డెంగీ కేసులు నమోదు కావడంతో ఆ కాలనీని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ మంగళవారం పరిశీలించారు. వెరిఫైడ్ పిన్ పాయింట్ యాక్టివిటీస్, మెడికల్ క్యాంపు సెటప్, దోమల పెంపకాన్ని నివారించడానికి లార్వా నిరోధక చర్యలు, పైరిత్రిమ్ స్ప్రే చేయించారు. డెంగీ వ్యాధి నివారణ గురించి కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఇందులో డీఎంవో డాక్టర్ శ్రీధర్ మిట్పెల్లివార్, సబ్ యూనిట్ ఆఫీసర్ రఘునాథ్, ఆడే సురేష్, పురపాలక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఉట్నూర్, జూలై 30: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని ట్రాన్స్‌కో ఎస్ఈ జైవంత్‌రావు చౌహాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం లోని సబ్‌స్టేషన్ ఆవరణలో ఆయన ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. హరితహారం కార్యక్రమం ద్వారా ప్రతీఒక్కరు మొక్కలు నాటితే వాతావరణ పరిస్థితులు మెరుగవుతాయని అన్నారు. ప్రతీ ఉద్యోగి విధిగా ఒక మొక్క నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ సుభాష్‌జాదవ్, ఏఈ రోహిదాస్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షి షా ● ప్రభుత్వ కొలాం బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు ● పరిశుభ్రత లేకపోవడంతో అసహనం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజార్షిషా



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తూ..

ఆదిలాబాద్ రూరల్, జూలై 30: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ కొలాం ఆశ్రమ పాఠశాల(బాలురు)ను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, సిక్ రూమ్, వంటగది, విద్యార్థుల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా రిజిష్టర్‌లను పరిశీలించి, హాజరు ఏరోజుకారోజు వేయాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పరిశుభ్రత పాటించాలని అన్నారు. విద్యార్థుల గదులు, సిక్ రూమ్ శుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండడంతో మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. వంట గదిని పరిశీలిస్తూ సరుకులు, వండే విధానాన్ని గమనించారు. అన్ని గదులను పరిశీలిస్తూ పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ బాగా చదువుకోవాలని, పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు ఇప్పటి నుంచే బాగా చదవాలని, ఏ సబ్జెక్టులోనైన వెనుకబడి ఉంటే ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలిపారు. ఏమైన సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడగగా ఫ్యాన్‌లు లేవని తెలపగా.. ఆ ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ రావ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

● **శాఖలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలి**

ఆదిలాబాద్ అర్బన్: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు సంబంధించి ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 75వ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పెద్దఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. 44లక్షల 6వేల మొక్కలకు గాను ఇప్పటి వరకు 19లక్షల 11వేల మొక్కలు నాటడం జరిగిందని అన్నారు. వర్షాలు కురుస్తున్నందున సమయం వృథా కాకుండా వెంటనే మిగతా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, ప్రభుత్వ సంస్థలలో మొక్కలు పెద్దఎత్తున నాటి, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం ఉపయోగపడే విధంగా మునగ, చింతపండు, కరివేపాకు, తదితర మొక్కలు నాటాలని తెలిపారు. వన మహోత్సవంలో పెద్దమొక్కలు నాటి, నాటిన ప్రతీ మొక్క బ్రతికే విధంగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని, జియో ట్యాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఆయా శాఖలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల వివరాలు తెలిపారు. అదేవిధంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేకదృష్టి సారించాలని పేర్కొన్నారు. అలాగే గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో, హాస్టల్‌లో చెత్త చెదారం లేకుండా శానిటేషన్‌పై శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతీ శుక్రవారం డ్రై డే డ్రైడే నిర్వహించాలని సూచించారు. ఇందులో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్‌మాలవీయ, జడ్పీ సీఈవో రత్నమాల, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయన్న, సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీవో, ఎంపీవో, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

సరైన పోషకాహారం అందించాలి

● తలమడుగు ప్రభుత్వ పాఠశాలలో తిథి భోజనాన్ని ప్రారంభించిన డీఈవో ప్రణీత ● పది పరీక్షలకు సిద్ధం కావాలని పలు సూచనలు

తలమడుగు, జూలై 30: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జిల్లా విద్యా అధికారి ప్రణీత ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన తిథి భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అదనంగా పోషక ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రభుత్వం ద్వారా ప్రారంభించిందన్నారు. పాఠశాలలో ఇటువంటి కార్యక్రమం సంవత్సర కాలంగా కొనసాగుతుందన్నారు. తలమడుగు పాఠశాలలో గత సంవత్సరం నుంచి కొనసాగడాన్ని అభినందించారు. తర్వాత 10వ తరగతి విద్యార్థులకు ప్రతీరోజు బడికి రావాలని, ఇప్పటి నుండే పరీక్షలకు సిద్ధం కావాలని, రివిజన్ చేయాలి, సందేహాలను ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. అలాగే మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఎన్ఏఎస్‌పై ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఒరియంటేషన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులను ఎన్ఏఎస్ టెస్ట్‌కు సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రణీత, సెక్టోరల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, ఎంఎన్‌వో వెంకట్‌రావు, కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణ కుమారి, ప్రత్యూష, ఆర్పీలు శంకర్, నగేష్, సంతోష్, శ్రీనివాస్, జడ్పీఎస్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి ప్రణీత




తలమడుగు పాఠశాలలో తిథి భోజనాన్ని ప్రారంభిస్తున్న డీఈవో



ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న ఎస్పీ, ఆర్టీసీ అధికారులు

నిబంధనలు పాటించాలి : ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 30: ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా ప్రతీఒక్కరు నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సూచించారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన ప్రమాద రహిత వారోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ సర్వీసులో అత్యధిక కాలం పాటు ప్రమాదరహిత డ్రైవింగ్ చేసిన సిబిరావు, మీనాజ్ ఉద్దీన్, అన్వర్‌ఖాన్ డ్రైవర్లను రీజినల్ మేనేజర్ సోలేమాన్‌తో కలిసి ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఇందులో డిప్యూటీ ఆర్ఎం(ఓ) ఎస్.ప్రణిత్, డిప్యూటీ ఆర్ఎం(ఎం) ప్రవీణ్‌కుమార్, పర్సనల్ ఆఫీసర్ గిబ్లా, అకౌంట్ ఆఫీసర్ శంకరయ్య, మంచిర్యాల డిపో మేనేజర్ జనార్ధన్, భైంసా డిపో మేనేజర్ హరిప్రసాద్, ఆదిలాబాద్ ఎంఎఫ్ శ్రీకర్, ఆర్ఎం ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ కిరణ్‌కుమార్, రాజేందర్, డిపో సూపరింటెండెంట్ విలాస్, ఉమ్మడి జిల్లా డ్రైవర్లు, స్టేడి డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్స్, సేఫ్టీ వాడెన్స్, ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



వాగ్దారిలో సీత్లా పండుగలో పాల్గొన్న గిరిజనులు

గిరిజన గ్రామాల్లో ఘనంగా సీత్లా పండుగ

నేరడిగొండ, జూలై 30: గిరిజనులు ప్రతియేటా సీత్లా పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. మంగళవారం మండలంలోని వాగ్ధారి, బొందిడి గ్రామాల్లో గిరిజనులు ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కట్టుబొట్టు వేషధారణ, ఆచార వ్యవహారాలు, సంస్కృతీ, సంప్రదాయాలు పవిత్రంగా ఉంటాయని, ప్రకృతిని పూజించడం, ప్రేమించడం గిరిజనుల ప్రత్యేక అని వారు పేర్కొన్నారు. పశుసంపద కోసం గిరిజనులు ఈ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గిరిజనులు జరుపుకునే పండుగ సీత్లా పండుగ అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గిరిజనులు, తదితరు పాల్గొన్నారు.

జరిమానా కట్టి పశువులను తీసుకెళ్లాలి

బోథ్, జూలై 30: మండలకేంద్రంలో రోడ్లపై తిరిగే పశువులను పట్టణానికి చెందిన పలువురు మంగలవారం పట్టుకుని బంజరదొడ్డికి తరలించారు. దాదాపు 40 వరకు పశువులను స్థానిక బంజరదొడ్డిలో వేయడం జరిగింది. అయితే ఈ పశువులన్నీ గ్రామం సమీపంలోని పంట పొలాలలో పడి పంటలను నాశనం చేస్తున్నాయన్న ఆగ్రహంతో వాటిని బంజర దొడ్డిలో వేశారు. అయితే బంజరదొడ్డిలో వేసిన పశువులను యజమానులు తీసుకుని వెళ్లాలని లేకుంటే ఒక రోజుకు వెయ్యి రూపాయల చొప్పున చెల్లించి తీసుకువెళ్లాల్సి ఉంటుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అయినా తీసుకోకపోతే మూడు రోజుల తర్వాత వేలం వేయడం లేదా, గోశాలకు తరలించడం జరుగుతుందని ఈవో అంజయ్య తెలిపారు.



బంజరదొడ్డిలో ఉన్న పశువులు

సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ

● పొచ్చెర గ్రామస్థులకు ఫోన్ కాల్స్

బోథ్,జూలై 30:సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేసేందుకు కొత్త కొత్త పంతాలలో ప్రజలను మోసం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని పొచ్చెరా గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులకు ఫోన్‌కాల్స్ చేసి డబ్బులు కాజేసేందుకు ఎత్తుగడ వేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పొచ్చెర గ్రామానికి చెందిన ఓవ్యక్తికి తాము హైదరాబాద్ నుంచి ఫోన్ చేసున్నామని అయితే మీకుమారుడు మావద్ద ఉన్నాడని, ఆయన డ్రగ్స్‌తో పట్టుపడ్డాడని ఫోన్ చేసి చెబుతున్నారు. అంతేగాక ఫోన్ కాల్ అందుకున్న వ్యక్తుల కుమారుల పేర్లు సైతం పేర్కొనడంతో అయోమయానికి గురయ్యారు. ఫోన్ చేసిన వ్యక్తి సెల్‌ఫోన్‌లో ఉన్న డీపీ పోలీస్ డ్రెస్‌లో ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఒకేసారి అయోమయానికి గురయ్యారు. అయితే మీ బాబును త్వరలోనే ప్రెస్‌మీట్ పెట్టి జైలుకు పంపించడం జరుగుతుందని వివరిస్తున్నారు. అయితే ఆందోళన చెందిన తల్లిదండ్రులు సార్ మేము డబ్బులు చెల్లిస్తాం. మావాళ్ళను విడిచిపెట్టండి అని బతిమిలాడితే రెండు నుంచి మూడు లక్షల రూపాయలు ఫోన్‌పే చేయాలని పేర్కొన్నారు. అయితే తమ వద్ద అంత డబ్బు లేదని, ప్రస్తుతం 50 వేలు ఉన్నాయని విద్యార్థి తండ్రి పేర్కొనడం జరిగింది.అయితే కేటుగాళ్లతో మాట్లాడిన ఒక వ్యక్తి తమ కుమారుడు ఇంట్లోనే ఉన్నాడని హైదరాబాద్ వెళ్లలేదని పేర్కొనడంతో సైబర్ నేరగాడు ఫోన్ పెట్టేసినట్లు తెలిపారు. ఏది ఏమైనా సైబర్ నేరగాళ్లు కొత్త పంతలో ప్రజలను మోసం చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

మావల , జూలై 30 : వివాహిత అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. మావల ఎస్సై విష్ణువర్థన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన వివాహిత (28)భర్తకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. కిరాణ షాపునకు వెళ్లి వస్తానని సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదు. ఫలితం లేకపోవడంతో మంగళవారం మావల పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదిలాబాద్‌లోని రెండు ఆలయాల్లో చోరీ

ఆదిలాబాద్ రూరల్, జూలై 30: ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీలోని రామాలయం, పోచమ్మ ఆలయంలో మంగళవారం తెల్లవారు జామున చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆలయాల్లోని హుండీలను పగలగొట్టి నగదు, కానుకలను దుండగులు అపహరించుకుపోయారు. పోచమ్మ విగ్రహానికి ఉన్న వెండి కళ్లను సైతం ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న మావల ఎస్సై విష్ణు వర్ధన్, క్లూస్ టీమ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి


జాదవ్ కార్తీక్ (ఫైల్)

గుడిహత్నూర్, జూలై 30: మండలంలోని గురుజ గ్రామంలో మంగళ వారం విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి చెందినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గురుజ గ్రామానికి చెందిన జాదవ్ కార్తీక్ (17) అనే విద్యార్థిన తన బావతో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. బోర్ మోటార్‌కు వచ్చే సర్వీసు వైరు ఇనుప కంచెపై పడటంతో విద్యుత్ సరఫరా అయింది. గమనించకుండా కంచెను పట్టుకోవడంతో విద్యుదాఘాతంతో కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెఇపారు. కార్తీక్ ఇటీవలే పదో తరగతి పూర్తి చేశాడు. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పిప్పల్‌దరిలో చెట్టు కింద గ్రామసభను నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారి

భవనం లేక చెట్టు కిందనే గ్రామ సభ

భోథ్, జూలై 30: మండలంలోని పిప్పల్‌దరి గ్రామంలో గ్రామ పంచాయితీ భవనం లేకపోవడంతో మంగళవారం ప్రత్యేక అధికారి సౌందర్య ఆధ్వర్యంలో చెట్టు కిందనే గ్రామసభ నిర్వహించారు. నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయితీకి భవనం లేకపోవడంతోఓ విధులు నిర్వహించడం కష్టంగా మారిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి వచ్చిన ప్రత్యేకాధికారి గ్రామంలో తిరిగి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులకు వివరించారు. అంతేగాక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అయితే గ్రామసభలో గ్రామస్థులంతా తమ గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల తీరు వల్ల తాము గ్రామ పంచాయతీ భవనానికి నోచుకోలేకపోతున్నామని వాపోయారు. కాగా సమావేశంలో మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు కావడం లేదని, బిల్లులు ఇప్పించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు ఏఎన్ఎం పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 30: అగ్రికల్చర్ రిసెర్చ్ స్టేషన్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. మంగళవారం ఏఆర్ఎస్ ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కూలి పెంచాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ ఏఆర్ఎస్‌లో పని చేస్తున్న కార్మికులకు కనీస కూలి ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు రోజు కూలీ రూ.700 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు పనిఒత్తిడిని తగ్గించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అగ్గిమల్ల స్వామి, శరత్, నర్సింగ్, లక్ష్మి, రిజ్వాన, సుశీల, సంగీత, వెంకటమ్మ, ఆశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు

నేరడిగొండ, జూలై 30: ఆషాఢ బోనాల ముగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని రోల్ మామడ మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు బోనాలు ఎత్తుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంబారావు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



రోల్‌మామడ పాఠశాలలో బోనాలతో విద్యార్థులు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● నార్నూర్, గాదిగూడ మండలాల్లో పర్యటించిన వైద్య విద్యావేత్త రవీందర్ రాథోడ్ ● పలు గ్రామాల్లో మెడికల్ క్యాంపులు

నార్నూర్, జూలై 30: గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా ఇంటి చుట్టు పక్కల పరిశుభ్రత లేనందున దోమలు, ఈగల ప్రభావంతో ప్రజలు రోగాలు పడే ఆస్కారం ఎక్కువగా ఉంటదని వైద్య విద్యావేత్త రవీందర్‌రాథోడ్ అన్నారు. మంగళవారం నార్నూర్, గాదిగూడ మండల పలు గ్రామాల్లో పర్యటించారు. ఝరి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో ఉన్న చిత్తగూడ, మాలెపూర్ ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు నిర్వహించారు. దాదాపు ఒకటిన్నర కిలో మీటర్ల మేరకు వైద్య సిబ్బందితో కలిసి కాలినడక ప్రయాణం చేసి ఆయా గ్రామాల్లో ఉన్న రోగులకు వైద్యం అందించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వైద్యంకి సంబంధించి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఎలాంటి ఇబ్బంది ఉన్న ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి. గర్భవతి మహిళలు సైతం ఆశా ఏఎన్ఎం సిబ్బందికి అందుబాటులో ఉంటూ ఆరోగ్యంకి సంబంధించిన సమాచారం ఇస్తూ ఉండాలని సూచించారు. ఎంసీపీ కార్డులు పరిశీలించారు.రోగుల ఈ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. వవారి వెంట వైద్య సిబ్బంది,ఏఎం



మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కుడిమెత మనోహర్



వాగుదాటి.. బురదమట్టిలో వైద్య సిబ్బంది కాలినడక

శ్రీదేవి, హెచ్ఏ వినోద్, తదితరులున్నారు.

● గిరిజన గ్రామాల్లో ప్రబలుతున్న వ్యాధులు

ఉట్నూర్: మండలంలోని గిరిజన గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలడం ప్రారంభమయ్యాయి. ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్‌లో విరేచనాలు, జ్వరాలతో బాధపడుతు హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావడంతో వైద్య సిబ్బంది వారిని అడ్మిట్ చేసుకొని సెలైన్లు ఎక్కిస్తున్నారు. హస్నాపురం చెందిన ఆర్టీసీ కండక్టర్ వాఘ్మారే పరశురాం,రాధా, దయానంద్, లత, నల్మా తదితరులు వీరేచనలతో బాధపడుతూ ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం చేరారు. హస్నాపూర్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు విరేచనాలు, జ్వరాలు రావడంతో సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హెచ్ఎం బండు పంపించి వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. మరోముగ్గురు విద్యార్థులకు చర్మ వ్యాధులు రావడంతో పాఠశాల ఏఎన్ఎం ఉట్నూర్‌లోని ఆసుపత్రికి వైద్యం



గ్రామస్థులకు వైద్యం అందిస్తున్న వైద్య సిబ్బంది

కోసం తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● అప్రమత్తతతోనే వ్యాధుల అదుపు

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో ప్రబలుతున్న అంటు వ్యాధులను అదుపు చేయడానికి ప్రజలు అప్రమత్తత కావడమే అవసరమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఇంద్రవెల్లి, ఆదిలాబాద్, గుడిహత్నూర్, ఇచ్చోడ, సిరికొండ, ఉట్నూర్, నేరడిగొండ మండలంలో గల కోలాం గ్రామాలలో ఐటీడీఏ ద్వారా చేపట్టిన కళాజాతా బృందాల ద్వారా ఆదివాసీ గ్రామాలలో వర్షాకాలం ప్రభలనున్న వ్యాధుల గురించి మలేరియా, డెంగ్యూ, డయేరియా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత బృందాల ద్వారా అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని మంగళవారం ఉట్నూర్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మనోహర్ అన్నారు. ఇప్పటి వరకు 13 డెంగ్యూ వ్యాధులను గుర్తించడం జరిగిందని అలాగే ఇప్పటి వరకు 56 గ్రామాలలో కళాజాతా బృందాల ద్వారా అవగాహన సదస్సులు పూర్తి చేయడం జరిగిందన్నారు. మరోపది రోజులలో అవగాహన సదస్సులు పూర్తి చేస్తామని అన్నారు. మలేరియా డెంగ్యూ వ్యాపించకుండా స్ప్రే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ తులసిదాస్, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

జైనథ్, జూలై 30: రాష్ట్రంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి అడ్డి రూకేష్ రెడ్డి, రైతు నాయకులు అల్లూరి అశోక్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదిక భవనంలో రెండో విడతగా నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌లు రైతులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లకు మండల రైతుల అవగాహన సదస్సులో పాల్గొన్నారు. రైతురుణమాఫీ, రైతు భరోసా, రైతుభీమా అంశాలపై చర్చించారు. ఇందులో ప్రత్యేకాధికారి సాంబ శివ రావ్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఏఈవోలు రక్షిత్, తౌసిఫ్, రైతు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో చిన్నారుల ప్రతిభ

ఆదిలాబాద్ రూరల్, జూలై 30: నిర్మల్‌లోని తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ కార్యాలయం ఆడిటోరియంలో వెన్నెల డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో ఆదిలాబాద్ బాలకేంద్రం చిన్నారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య, బృంద నాట్యం, సోలో విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సొంతం చేసుకున్నారు. నిర్మల్ జిల్లా మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, వెన్నెల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ ధనరాజ్, డాక్టర్ మురళీకృష్ణ విజేతలకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు.



జైనథ్‌లో మహారాష్ట్ర బ్యాంక్ మేనేజర్‌ను నిలదీస్తున్న రైతులు

రైతు రుణమాఫీలో బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం

● జైనథ్‌లో బీవోఎం మేనేజర్‌ను నిలదీసిన రైతులు

జైనథ్, జూలై 30: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రూ.2లక్షల రైతు రుణమాఫీలో జైనథ్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అధికారుల నిండు నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు చంద వెంకట్‌రెడ్డి, ముక్కర లక్ష్మణ్, డి.వెంకన్నలు ఆరోపించారు. మంగళవారం రెండో విడత రైతు రుణమాఫీకి సంబంధించి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విడుదల చేసిన రుణమాఫీ లిస్టుపై రైతులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. స్థానిక బ్యాంక్ ముందు రైతులు భైఠాయించి మేనేజర్ గవ్విరెడ్డి శివప్రసాద్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులు జైనథ్ బ్రాంచ్‌లో 500 మంది రైతులు ఉండగా.. 2018 నుంచి 2023 వరకు రుణాల ఆప్‌డేట్ అధికారులు చేయ లేదన్నారు. ఆధార్, పాన్‌కార్డులు ఖాతాలకు లింక్ చేసే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. రైతు లక్ష తీసుకుంటే రూ.50వేలు ఖాతాలో ఎలా? పడతాయన్నారు. 50వేలు తీసుకుంటూ రూ.లక్ష రూపాయలు ఖాతాల్లో ఏ విధంగా? వేస్తారని ప్రశ్నించారు. రైతులకు న్యాయం జరగపోతే జైనథ్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇందులో రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఆదిలాబాద్ రూరల్, జూలై 30: జిల్లాకేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో మంగళవారం నిరుద్యోగ యువకులకు నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 500 మంది అభ్యర్థులు జాబ్ మేళాకు తరలివచ్చారు. జిల్లా ఉపాధి అధికారి మిల్కా, స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు అభ్యర్థులు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హత ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఉపాధి కార్యాలయం సిబ్బంది గోవర్ధన్, శంకర్ పాల్గొన్నారు.

'జయకేతనం ఎగరవేయాలి'

ఉట్నూర్, జూలై 30: రాష్ట్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు జయకేతనం ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని తిరుమల ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారం చేపట్టిన ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నందున ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించి ప్రజలను ఓట్లు అడగాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికులకే సీట్లు కేటాయించడం జరుగుతుందని, ఎవరు అలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు అన్నారు. ఇందులో రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, ఉట్నూర్ మండల అధ్యక్షుడు రాజశేఖర్,మాజీ ఎంపీపీ ఆడే ధన్లాల్‌నాయక్, మాజీ జడ్పీటీసీ సాడిగేగంగన్న, తదితరులున్నారు.

వివేకానంద ఆవాస్ కేంద్రంలో న్యాయాధికారి ఆకస్మిక తనిఖీ

భైంసా, జూలై 30 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని వివేకానంద నిరాశ్రిత బాలుర అవాస కేంద్రాన్ని మంగళవారం ఇక్కడి జూనియర్ సివిల్ జడ్జీ దేవేంద్రబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి అవాస కేంద్రానికి వెళ్లిన జడ్జీ అక్కడ అవాస కేంద్రం నిర్వాహణ రికార్డులను, వంట గది, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థుల రీడింగ్ రూమ్, పడుకునే గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతులు, సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.అవాసం ప్రతినిధులతో నిర్వాహణ వ్యవస్థ గుర్చి వివరాలు మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ చదువుతోనే ప్రగతి సాధ్యమవుతుందని, ప్రణాళికబద్ధంగా చదువుకొని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని సూచించారు. ,




మాట్లాడుతున్న న్యాయాధికారి దేవేంద్రబాబు

మరమ్మతులై నెలైనా గడవకముందే..

కడెం ప్రాజెక్టు గేట్ల లీకేజీ

● ప్రాజెక్టు మూడు గేట్ల ద్వారా లీకేజీ రూపంలో నీరు గోదావరి పాలు ● ప్రభుత్వం రూ. 9 కోట్లు వెచ్చించి మరమ్మతులు చేసినా.. నిర్లక్ష్యం వీడని అధికారులు ● పట్టించుకోవాలని కోరుతున్న రైతులు



కడెం జలాశయం నుంచి 13, 14, 15వ నంబర్ గేట్ల ద్వారా లీకేజీ రూపంలో గోదావరిలోకి వృథాగా పోతున్న నీరు

ఖానాపూర్, జూలై 30 : నిన్నామొన్నటి వరకు నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు నిర్వహించినప్పటికీ.. ఇంకా లీకేజీల రూపంలో నీరు గోదావరి పాలవుతోంది. గత రెండేళ్లుగా భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి పెద్దఎత్తున వరద నీరు చేరడంతో.. ఒక దశలో ప్రాజెక్టు ప్రమాదకర స్థితిలోకి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతులను పట్టించుకోకపోవడంతో గత రెండేళ్లుగా కడెం ఆయకట్టు రైతులు పంటలను పండించుకునేందుకు దూరమయ్యారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జులు కడెం ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. దీంతో అనుకున్నదే తడువుగా ప్రాజెక్టు మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేశారు. రూ.9 కోట్ల పైచిలుకు నిధులతో ప్రాజెక్టు వద్ద గత నెల క్రితం వరకు గేట్లు మరమ్మతులతో పాటు సీసీ, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగంలో ఆయా పనులు నిర్వహించారు. తాజాగా కురిసిన భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వచ్చిన వరదను మేనేజ్ చేస్తూ ఎటువంటి ప్రమాదానికి దారి తీయకుండా అధికారులు ప్రాజెక్టు వద్ద ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోల సమతూకాన్ని పాటించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ తాజాగా వర్షాలు తగ్గుముఖం పట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గింది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700ల అడుగులు కాగా.. ప్రస్తుతం 695.450 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.467 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 4,199 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా.. పంట కాలువల ద్వారా మిషన్ భగీరథ కోసం మొత్తం కలిపి 908 క్యూసెక్కుల నీరు ఔట్ ఫ్లో రూపంలో బయటకు వెళ్తోంది. ఈ దశలో ప్రాజెక్టులో ఉన్న ప్రతీ నీటి చుక్కను ఒడిసిపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కడెం ప్రాజెక్టు గేట్ల నుంచి లీకేజీ రూపంలో నీరు నిరంతరం గోదావరి పాలవుతోంది.

● మూడు గేట్ల ద్వారా నిరంతరం నీటి లీకేజీ

కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరినప్పుడు 4 వరద గేట్లను ఎత్తి నీటిని గోదావరిలోకి వదిలిన అధికారులు.. గత రెండు రోజులుగా ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో తగ్గడంతో గేట్లను మూసివేశారు. అయినప్పటికీ కడెం ప్రాజెక్టు 13వ నంబర్ గేటు, 14, 15వ నంబర్ గేట్లు.. ఇలా మూడు గేట్ల ద్వారా నిరంతరం నీటి లీకేజీ జరుగుతోంది. దీంతో ప్రాజెక్టు నుంచి నీరు బయటకు వెళ్లకుండా చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కడెం ఆయకట్టు కింద ఖానాపూర్, మంచిర్యాల నియోజకవర్గాలలో 68,150 ఎకరాల వ్యవసాయ భూములు సాగు అవుతాయి. ప్రస్తుతం ప్రాజెక్టు మరమ్మతులు పూర్తయిన నేపథ్యంలో ప్రాజెక్టు నుంచి అనవసరంగా నీటిని గోదావరి పాలు కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. కడెం ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు నిర్వహించి ఇంకా నెల రోజులైనా గడవకముందే మూడు గేట్ల నుంచి నీరు లీకేజీ రూపంలో బయటకు వెళ్లడం పలు విమర్శలకు తావిస్తోంది. పనుల నిర్వహణలో లోపమా!? లేదా పర్యవేక్షణలో లోపమా!? లేదా గేట్లను సరిగ్గా దింపడంలో జరిగిన తప్పిదమో గ్రహించి అధికారులు వెంటనే గేట్ల లీకేజీని నిలువరించకపోతే రానున్న రోజుల్లో ఆయకట్టు రైతులు తిరిగి ఆందోళన బాట పట్టక తప్పని పరిస్థితి నెలకొంటుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం కడెం ప్రాజెక్టుపై మరోసారి దృష్టి సారించాలని అన్నదాతలు కోరుతున్నారు.

● గేట్లకు ఎటువంటి ఇబ్బంది లేదు.. చెత్త తట్టుకొని ఉండొచ్చు..

కడెం ప్రాజెక్టు గేట్లకు ఎటువంటి ఇబ్బంది లేదు. గేట్లు దింపే సమయంలో ఏదైనా చెత్తా చెదారం అడ్డుగా వస్తే నీళ్ల లీకేజీ రూపంలో బయటకు వెళ్తాయి. ఇంకా వర్షాకాలం పూర్తి కాలేదు. ప్రాజెక్టు నిండుతుంది. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఎటువంటి లీకేజీ లేకుండా చర్యలు తీసుకుంటాం.

రాథోడ్ విఠల్ (ఈఈ, కడెం ప్రాజెక్టు)

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్టం 27.9 కనిష్టం 25.5
నిర్మల్ జిల్లా వార్తలు
6
బుధవారం 31 జూలై 2024





కోతుల బీభత్సం

- జిల్లాలోని అనేక గ్రామాల్లో వానరాల స్వైర విహారం
- వీధుల్లో గుంపులుగా కోతులు
- పలుచోట్ల జనంపై దాడి.. ఇప్పటికే చాలా మందికి గాయాలు
- ఫలితమివ్వని మంకీ రెస్క్యూ సెంటర్
- సహకరించని పంచాయతీ, మున్సిపాలిటీల అధికారులు

నిర్మల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనే కాకుండా చాలా గ్రామాల్లో కోతులతో జనం తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ముఖ్యంగా గత ఐదారు నెలల నుంచి కోతుల గుంపుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం జనాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని గల్లీలలో కోతుల బీభత్సంతో జనం తల్లడిల్లి పోతున్నారు. వీధుల్లో కోతులు గంటల తరబడి హంగామా సృష్టిస్తున్నాయి. గల్లీలలో కోతుల గుంపులన్నీ భారీ సంఖ్యలో గలాటా చేస్తున్న కారణంగా జనం ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేక అవస్థల పాలవుతున్నారు. చేతిలో కర్ర లేకుండా ఒక గల్లీ నుండి ఇంకో గల్లీకి దాటి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఒకవేళ ఎవరైనా ఒక కోతిని బెదిరిస్తే పదుల సంఖ్యలో కోతుల గుంపులు వచ్చి ఎదురుదాడి చేస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది కోతుల దాడిలో గాయపడ్డ వారు ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతీరోజు ఐదారుగురు కన్నా ఎక్కువ మంది కోతుల దాడిలో గాయపడిన వారు చికిత్సల కోసం వస్తున్నట్లు వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. అయితే కోతులు ఇళ్లల్లోకి కూడా చొరబడుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. కోతులు కొట్లాడుకుంటూ గుంపులు గుంపులుగా దాడులు చేసుకుంటున్న కారణంగా ప్రజలు ఆ దృశ్యాలను చూసి భయాందోళనకు గురవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇలా కోతులతో జనం సహవాసం చేస్తూ తీవ్ర టెన్షన్‌కు లోనవుతున్నారు. ఇప్పటికే చాలా మంది మున్సిపల్ అధికారులకు ఫారెస్ట్ అధికారులకు కోతుల విషయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లల్లోకి చొరబడుతున్న కోతులు అక్కడి పంట చేలను సైతం నాశనం చేస్తున్నాయని అంటున్నారు. గుంపులు గుంపులుగా పంటలపై దాడులు చేస్తుండడంతో రైతులు రాత్రింబవళ్లు వాటిని అడ్డుకునేందుకు కాపలా కాస్తున్నారు. పంటలను కోతుల నుంచి రక్షించుకోవడం రైతులకు సవాలుగా మారింది. అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు సైతం ఈ కోతుల బాధ నుంచి ఎలా బయట పడతామోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కోతుల నుంచి జనాన్ని, రైతులను కాపాడేందుకోసం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

● పట్టించుకోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు

కోతుల నుంచి రక్షించే విషయంలో సంబంధిత మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని కోతులను మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు పట్టుకొని నిర్మల్‌లోని కోతుల పునరావాస కేంద్రానికి తరలించాల్సి ఉంది. అయితే కోతులు పట్టే వ్యవహారం ఖరీదుగా మారిపోవడమే కాకుండా కోతులు పట్టేవారు కూడా అందుబాటులో లేకపోతుండడం సమస్యను మరింత జటిలం చేస్తుందంటున్నారు. మున్సిపాలిటీలు గ్రామ పంచాయతీలలో కోతులను పట్టుకునేందుకు ఎలాంటి బడ్జెట్ లేకపోవడం ఓ సమస్యగా మారిందంటున్నారు. అయితే కొన్ని గ్రామ పంచాయతీలు మాత్రం సాధారణ నిధుల నుండి కోతులను పట్టుకొని నిర్మల్ పునరావాసానికి తరలిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం ఇక్కడి చించోలి వద్ద గల కోతుల పునరావాస కేంద్రానికి సిద్దిపేట, నర్సాపూర్ మున్సిపాలిటీల నుండి దాదాపు 500ల కోతులను కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం తీసుకువచ్చినట్లు ఇక్కడి వైద్యాధికారి తెలిపారు. అయితే జిల్లా నుంచి మాత్రం ఆశించిన రీతిలో పునరావాస కేంద్రానికి కోతులను స్టెరిలైజేషన్ కోసం తీసుకురాకపోతుండడం విమర్శలకు తావిస్తోంది.

● నాలుగేళ్ల నుంచి 1500 స్టెరిలైజేషన్లు మాత్రమే..

జిల్లా కేంద్ర సమీపంలోని చించోలి(బి) గండిరామన్న హరితవనంలో 2020లో ఏర్పాటు చేసిన మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ (కోతుల పునరావాస కేంద్రం)లో ఇప్పటి వరకు కేవలం సుమారు 1500 వరకు కోతులకు మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు (స్టెరిలైజేషన్) చేశారు. ఇక్కడ 2020 డిసెంబరులో కోతుల పునరావాస కేంద్రాన్ని దాదాపు రూ.2.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో గల కోతులను పట్టుకొని ఇక్కడి కేంద్రానికి తీసుకురావాల్సి ఉంది. ఇక్కడ స్టెరిలైజేషన్లు కాగానే వాటిని తిరిగి అదే ప్రాంతానికి పంపుతారు. ప్రతీరోజు 20కి పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే సౌకర్యం ఇక్కడ ఉన్నట్లు పశువైద్యాధికారి తెలిపారు. ఇక్కడి కేంద్రంలో 150కి పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసి వారం రోజులపాటు ఇక్కడే పునరావాసం కల్పించే సౌకర్యం కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడ ఉన్న సౌకర్యాలకు అనుగుణంగా ఇప్పటివరకు దాదాపు 5వేల నుంచి 10 వేల కోతులకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉన్నప్పటికీ కేవలం సుమారు 1500 కోతులకు మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగడం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. జనాలు కోతుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ.. ఆయా పాలకవర్గాలు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ప్రభుత్వం దృష్టి సారించాలి

రోజురోజుకూ కోతుల ఆగడాలు పతాకస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించాలని కోరుతున్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా ఇక్కడ రెండో మంకీ రెస్క్యూ సెంటర్‌ను ఏర్పాటు చేసినప్పటికీ.. దాని నిర్వహణపై ప్రభుత్వం గానీ సంబంధిత శాఖలు గానీ పట్టించుకోకపోవడం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోతోంది. ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు కోతులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. నిధుల కొరతతో సతమతమవుతున్న స్థానిక సంస్థలు కోతులను పట్టుకునేందుకు ఆశించిన మేరకు ఖర్చు చేయలేకపోతున్నాయి. ఒక్కో కోతిని పట్టుకునేందుకు రూ. 500 నుంచి రూ. 1000 వరకు ఖర్చు కానున్నందున స్థానిక సంస్థలు ఆ భారాన్ని మోయలేకపోతున్నాయంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంకీ రెస్క్యూ సెంటర్ నిర్వహణ విషయంలో పెద్దగా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా మంకీ రెస్క్యూ సెంటర్ నిర్వహణను పకడ్బందీగా చేపట్టి కోతుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.



డీసీసీ అధ్యక్షుడిని కలిసిన ముదిరాజ్‌లు



శ్రీహరిరావును సన్మానిస్తున్న ముదిరాజ్ సభ్యులు

నిర్మల్ కల్చరల్, జూలై 30 : డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావును మంగళవారం డ్యాంగాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘ నాయకులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సన్మానించారు. పెద్దమ్మ తల్లి ఆలయానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. జిల్లా కోర్ కమిటీ సభ్యులు ఉమా మహేశ్వర్, సంతోష్, అశోక్, సాయన్న, నారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు, ఆశా కార్యకర్తల అరెస్ట్



పోలీసుస్టేషన్‌లో ఉన్న ఆశాలు, పారిశుధ్య కార్మికులు

దిలావర్‌పూర్, జూలై 30 : హైదరాబాద్‌లో మెరుపు సమ్మెకు హాజరవుతారన్న కారణంతో పోలీసులు మంగళవారం పారిశుధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉదయమే పారిశుధ్య కార్మికుల ఇళ్లకు వెళ్లి కార్మికులను అదుపులోకి తీసుకోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. అదుపులోకి తీసుకున్న కార్మికులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. మూడు గంటల పాటు పోలీసుస్టేషన్‌లోనే ఉంచారు. అనంతరం కార్మికుల, ఆశా కార్యకర్తలు సంతకాలు తీసుకుని వదిలిపెట్టారు.

పెరుగుతున్న గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటి మట్టం



గడ్డెన్నవాగు ప్రాజెక్టులోని నీటి నిల్వలు

భైంసా, జూలై 30 : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల మూలంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రాజెక్టు నీటి మట్టం క్రమక్రమంగా పెరుగుతూ పోతోంది. ఆదివారం ప్రాజెక్టు నీటి మట్టం 356.1 మీటర్లు , నీటి నిల్వలు 0.791 టీఎంసీలుగా ఉండగా మంగళవారం నాటికి నీటి మట్టం 0.3 మీటర్లు పెరిగింది. దీంతో ప్రాజెక్టు నీటి మట్టం 356.4 మీటర్లకు, నీటి నిల్వలు 0.877 టీఎంసీలకు చేరుకున్నాయి.ప్రస్తుతం ప్రాజెక్టులోకి 324 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లుగా ఉండగా నీటి సామర్థ్యం 1.852 టీఎంసీలుగా ఉంది.

అసెంబ్లీ దృష్టికి

భైంసా డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారుల సమస్య

- సమావేశంలో ప్రస్తావించిన ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



భైంసా లోని డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయం.. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, జూలై 30: గత నెలన్నర రోజులుగా భైంసా డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులు తమకు ఇళ్లను అప్పచెప్పాలంటూ చేపడుతున్న ఆందోళనలను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ అసెంబ్లీ దృష్టికి తీసుకవెళ్లారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ సంబంధిత సమస్యను ప్రస్తావించారు. ఏడాది కాలం క్రితం లక్కీ డ్రా ద్వారా ఎంపికైన లబ్దిదారులకు ఇప్పటి వరకు ఇళ్లను కేటాయింపులు జరుగలేదన్నారు. సంబంధిత చర్యను వ్యతిరేకిస్తూ లబ్దిదారులు నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్‌ల సమస్యను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు బాసర ట్రిపుల్ ఐటీ, నియోజక వర్గ పరిధిలోని విద్య, వైద్య రంగాల్లోన నెలకొని ఉన్న సమస్యలను ప్రస్తావించారు. త్వరితగతిన వీటన్నింటిని పరిష్కరించాలని అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లారు.

దవాఖానాలో మురికి నీరు చేరకుండా చర్యలు

- పంచాయతీరాజ్ ఈఈ శంకర్



మురికి కాలువను పరిశీలిస్తున్న అధికారులు

కుభీర్, జూలై 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మురికి నీరు చేరకుండా చర్యలు చేపడతామని పంచాయతీరాజ్ ఈఈ శంకర్ అన్నారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మంగళవారం ఆయన ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. గ్రామంలోని వడ్డెర కాలనీ నుండి మెయిన్ బజార్ రోడ్ గుండా ప్రవహించే మురికి కాల్వపై పలువురు అక్రమంగా రేకులషెడ్‌లు దుకాణాలు వేయడం వల్ల మురికి నీరు ప్రవహించకుండా ముంపుకు గురై వర్షం కురిసినప్పుడు మురికినీరు ఆసుపత్రి ఆవరణలోకి చేరుతోందని అన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించి మురికి కాలువ స్థాయిని పెంచి నూతన నిర్మాణాన్ని చేపట్టి వసతులు కల్పించేలా చేయాలని ఇక్కడి పరిస్థితులను నివేదికలుగా రూపొందించి జిల్లా కలెక్టరుకు అందజేస్తామన్నారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ డిప్యూటీ తౌఫిక్, చందునాయక్, ఎంపీడీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, కారోబారి ప్రకాష్ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

దిలావర్‌పూర్, జూలై 30 : వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పంచాయతీ అధికారి గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వివిధ వార్డుల్లో పారిశుద్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. లేదంటే డెంగ్యూ, మలేరియా, బోధకాలు, మెదడు వాపు వ్యాధులు వచ్చే ప్రమాదముందన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

రుణమాఫీతో రైతులకు ప్రయోజనం చేకూరుతుంది

కలెక్టర్ అభిలాష అభినవ్



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జూలై 30 : రుణమాఫీతో రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం రాష్ట్ర శాసనసభ ప్రాంగణం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండవ విడత రైతు రుణమాఫీలో భాగంగా రుణమాఫీ చెక్కులను ఆమె రైతులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా లక్ష యాభై వేల రూపాయల వరకు రుణాలు పొందిన రైతుల ఖాతాలలో నిధులు జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో రెండో విడతలో రుణమాఫీకి సంబంధించి 19,058 మంది రైతులకు 200.17 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా 30 వేల 105 మంది రైతులకు 171.6 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. మొత్తం రెండు విడతల్లో కలిపి 49 వేల 163 మంది రైతులు 371.93 కోట్ల రూపాయలను జమ చేశామన్నారు. ఇప్పటి వరకు రుణమాఫీ డబ్బులు పొందని రైతులు సంబంధిత మండల వ్యవసాయ శాఖ అధికారులకు తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. ఆధార్ కార్డులలో పొరపాట్ల కారణంగా రైతు రుణమాఫీలో పేరు రాని, ఖాతాలో డబ్బులు జమ కాని రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అలాగే కలెక్టరేట్‌లోని ఫిర్యాదుల విభాగంలో కూడా తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చు అన్నారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే రైతు రుణమాఫీ సహాయ కేంద్రం మొబైల్ నంబర్ 7288894050కు సంప్రదించడం ద్వారా తమ సందేహాలను, ఇతర వివరాలను తెలుసుకోవచ్చునని తెలిపారు. బ్యాంకర్లు రైతులకు మరింత సహకరించాలని తెలిపారు.

రికార్డులను పరిశీలించిన అదనపు కలెక్టర్



దహెగాం గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తానూర్, జూలై 30 : మండలంలోని హంగీర్గ, దౌల్తాబాద్ గ్రామాల్లో అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లోని డంపింగ్‌యార్డులో నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధిహామి సిబ్బందికి ప్రతి ఒక్కరు మొక్కను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని, గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సమ్మద్, ఏపీవో గంగాధర్, మాజీ సర్పంచ్ బాలాజీ, ఏఈవో పవన్ ప్రసాద్, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులున్నారు.

విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు సేవలు అందించాలి

గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించాలి : డీఎస్పీ ఏ. గంగారెడ్డి



పరేడ్ చేస్తున్న పోలీసులు

సారంగాపూర్ రూరల్, జూలై 30 : విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు సేవలందించాలని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను వివరించి పలు సూచనలు ఇచ్చారు. నేరాలను నియంత్రించడంతో పాటు శాంతి భద్రతలపై ప్రజలకు నమ్మకం కలగాలంటే విజిబుల్ పోలీసింగ్‌తోనే సాధ్యమవుతుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్ కీలకమన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా విలేజ్ పోలీస్ అధికారులు, పెట్రోకార్, బ్లూ కోల్ట్ సిబ్బంది తరచుగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. ఎవరైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ వస్తే విధులు నిర్వహిస్తున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ నిరంతరంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ సిబ్బందితో పరేడ్ నిర్వహించి ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజల మధ్యే ఉంటూ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న పోలీసుల పాత్రే కీలకమని ప్రతి గ్రామంపై అవగాహన కలిగి ఉండడంతో పాటు ప్రజలతో కలిసిమెలసి ఉండాలని పేర్కొన్నారు. నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు కేసుల దర్యాప్తులలో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ పద్ధతులను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.


సంక్షిప్త సమాచారం

పురుగుల మందు తాగి ఒకరి మృతి



పెంబి, జూలై 30 : పురుగుల మదు తాగి కనక శేఖర్ మృతి చెందిన సంఘటన పెంబి మండలంలోని జంగుగూడ గ్రామంలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని జంగుగూడ గ్రామానికి చెందిన కనక శేఖర్ (21) తాగుడికి బానిసై తాగిన మైకంలో సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



సారంగాపూర్ రూరల్, జూలై 30 : మండలంలో గల వంజర్ గ్రామానికి చెందిన రమణారెడ్డి అనే రైతు గేదె మంగళవారం విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పంట పొలాల్లో ఉన్నటువంటి 11 కేవీ విద్యుత్ స్తంభానికి విద్యుత్ సరఫరా కావడంతో గేదె పంట పొలాల్లోకి పశుగ్రాసం కోసం వెళ్లిన సమయంలో విద్యుత్ స్తంభానికి తగిలి మృతి చెందినట్లు తెలిపారు. సుమారు గేదె విలువ రూ. లక్ష ఉంటుందని పేర్కొన్నారు.

వారసంత వేలం పూర్తి

తానూర్, జూలై 30 : మండల కేంద్రం తానూర్‌లోని గ్రామపంచాయతీ పరిధిలో జరిగే వారసంత యొక్క వేలం పాటను మంగళవారం నిర్వహించినట్లు పంచాయతీ సెక్రటరీ జలం సింగ్ తెలిపారు. గ్రామానికి చెందిన సబ్బీర్‌ఖాన్ రూ. 1,92,000లకు వేలంలో వారసంతను దక్కించుకున్నాడని పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి గాను నిర్వహించిన ఈ మార్కెట్ వేలం 2024 ఆగస్టు నుండి 2025 మార్చి వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

మొక్కలను పంపిణీ చేసిన కౌన్సిలర్

నిర్మల్ కల్చరల్, జూలై 30 : నిర్మల్ పట్టణ రెండవ వార్డు కౌన్సిలర్ సాధం స్వప్న అరవింద్ మంగళవారం నాయుడివాడలో ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా అంటురోగాలు ప్రబలకుండా ఉండేందుకు అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఐకేపీలతో కలిసి నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు సాధం అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

కుభీర్, జూలై 30 : మండల సమాఖ్య కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా బి. లక్ష్మి(నిగ్వా), ఉపాధ్యక్షురాలుగా రజిత(కుప్టి), కార్యదర్శిగా ఎం. రాజకళ, సహాయ కార్యదర్శిగా స్వప్న (సొనారి), కోశాధికారిగా జ్యోతి (హాంపోలీ)లను ఎన్నుకున్నారు.